కొనసాగుతున్న ప్రజాపాలన గ్రామసభలు

దహెగాం, డిసెంబర్30 : మండలంలో ప్రజాపాలన గ్రామసభలు కొనసాగుతున్నాయి. శనివారం తహసీల్దార్ బృందం ఒడ్డుగూడ, చిన్నరాస్పల్లి, ఎంపీడీవో బృందం ఇట్యాల, బోర్లకుంట పంచాయతీల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తు ఫారాలు అంద జేయడంతోపాటు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవోలు మాట్లాడారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ఈ కార్యక్రమం జనవరి 6వరకు కొనసాగుతుందన్నారు. దరఖాస్తులను జాగ్రత్త నింపాలని వారు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

• అర్హుల ఎంపిక కోసమే ప్రజాపాలన

వాంకిడి,డిసెంబర్28: అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసమే ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తహసీల్దార్ రహీమొద్దీన్ అన్నారు.శనివారం మండలంలోని లక్ష్మిపూర్ గ్రామపంచాయతీ ఆవర్ణలో ప్రజాపాలన కార్యక్రమాన్ని సర్పంచ్ నీలబాయి,ఏవో మిలింద్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తు చేసు కోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

• అందుబాటులో దరఖాస్తు ఫారాలు

రెబ్బెన, డిసెంబర్ 30: మండలంలోని 24 గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రజాపాలన ఆరు గ్యారెంటీ స్కీంలకు సంబంధించిన దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని ఎంపీడీవో పరికిపండ్ల శ్రీనివాస్, తహసీల్దార్ సమీర్‌లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ కోసం 94 కౌంటర్‌లు ఏర్పాటు చేశామని, సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి దరఖాస్తు ఫారాలు అందించి నింపిన ఫారాలు స్వీకరించి రసీదు అందిస్తున్నారని తెలిపారు. దరఖాస్తు ఫారాలు ఎవరైనా డబ్బులకు అమ్మినా, ఫారం నింపడానికి డబ్బులు తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దరఖాస్తు ఫారంలో ప్రతి ఒక్క కాలం క్షుణ్ణంగా చదివి నింపాలని సూచించారు. రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునే వారు తెల్లకాగితంపై పూర్తి వివరాలతో అప్లికేషన్ రాసి అందించాలని సూచించారు. దళారుల వద్దకు ఎవరూ వెళ్లొద్దని, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సిబ్బందిని అడిగితే అన్ని వివరాలు చెబుతారని పేర్కొన్నారు.



ఆసిఫాబాద్: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్

గోలేటిలో దరఖాస్తు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్

• చింతలమానేపల్లి మండలంలో..

చింతలమానేపల్లి, డిసెంబర్ 30 : రవీంద్రనగర్-1,2 గ్రామాల్లో శనివారం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎంపీపీ డుబ్బుల నానయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని అర్హులైన ప్రతీ ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, మండ ల ప్రత్యేక అధికారి కుటుంబరావు, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ నాగరాజ్‌గౌడ్ డిప్యూటీ తహసీల్దార్ మస్కుర్ అలీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

• దరఖాస్తుల స్వీకరణ

రెబ్బెన, డిసెంబర్ 30: అర్హులైన పేదలకు సర్కారు అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలు లబ్ధి చేకూర్చడం కోసమే ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరిస్తున్నామని ఆసిఫాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ స్పష్టం చేశారు. మండలం లోని గోలేటి, పులికుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లను సందర్శించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని, ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి తప్పకుండా చేరుతాయన్నారు. ప్రజలు దరఖాస్తులు ఎలాంటి తప్పులు లేకుండా నింపి ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ జత చేసి కౌంటర్‌లలో అందించి తప్పకుండా రసీదు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గాజుల రవీందర్, మాజీ ఎంపీటీసీ సురేందర్‌రాజు, నాయకులు దుర్గం రవీందర్, మోడెం చిరంజీవిగౌడ్, పూదరి సాయి పలువురు ఉన్నారు.

• అర్హులందరికీ పథకాలు

సర్కారు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ఐదు గ్యారెంటీ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయని రెబ్బెన స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్ స్పష్టం చేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్యారంటీ పథకాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నది. శనివారం నంబాల, ధర్మారం, ఖైర్‌గూడ, పులికుంట గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామసభలకు స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్‌తో పాటు ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ సమీర్‌లు హాజరై మాట్లాడారు. జనవరి 6వ తేదీ వరకు ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లలో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జడ్పీటీసీ వేముర్ల సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, సర్పంచ్‌లు చెన్న సోమశేఖర్, బుర్స పోశమల్లు, ఎంపీటీసీ సంగం శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీవో అంజాద్‌పాషా, ఎఎస్‌ఐ లక్ష్మణ్, ఏపీఎం రాజ్‌కుమార్, ఏపీవో బుచ్చన్న, ఏఈ ఇమ్రాన్, పలువురు ఉన్నారు.

• పెంచికల్ పేట్‌లో..

పెంచికల్ పేట్, డిసెంబర్ 30: ప్రజాపాలన కార్యక్రమంలో అభయహస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ సూచించారు. శనివారం మండలంలోని అగర్ గూడలో తహసీల్దార్ బృందం, కమ్మర్‌గాం, మొర్లి గూడలో ఎంపీడీవో బృందం గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఉచిత దరఖాస్తులను అందజేస్తున్నామని వాటిని పూర్తి సమాచారంతో మీ మీ జీపీల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో అందజేయాలని తెలిపారు. శనివారం మండల వ్యాప్తంగా దాదాపు 1220 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో గంగాసింగ్ సర్పంచ్‌లు సుధాకర్, మధునయ్య, ఈశ్వరి బాయ్, అధికారుల బృందం తదితరులు పాల్గొన్నారు.

• ప్రజాపాలన పకడ్బందీగా చేపట్టాలి

ఆసిఫాబాద్ ,డిసెంబర్30: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అన్నారు. శనివారం మండలంలోని చౌర్‌పల్లి, గుండి, తుంపెల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొని దరఖాస్తుల కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల అందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని సూచించారు. సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ హైమద్, ఏఎంసీ మాజీ చైర్మన్, గుండి ఎంపీటీసీ గాదవేని మల్లేశ్, డిప్యూటీ తహసీల్దార్ పోచయ్య, మాజీ ఎఎంసీ చైర్మన్ గంధం శ్రీనివాస్, ఎంపీడీవో శశికల, ఎంపీవో ప్రసాద్, ఏపీవో చంద్రశేఖర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

• జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే హరీశ్ బాబు
• పెంచికల్ పేట్, బెజ్జూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే హరీశ్ రావు

పెంచికల్‌పేట్,డిసెంబర్30: సమష్టి కృషితోనే మండల అభివృద్ధి సాధ్యం అవుతుందని జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో అభయ హస్తం ఆరు గ్యారంటీలకు ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాలను అధికారులు పారదర్శకంగా నిర్వహించి ప్రజలకు చేరే విధంగా కృషి చేయాలని సూచించారు. ముందుగా సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరి సమన్వయంతో కృషి చేస్తానన్నారు. గిరిజన మారుమూల గ్రామాలకు బీటీ రోడ్ నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్యే పదవులు చేపట్టి మొట్టమొదటిసారిగా మండలానికి విచ్చేసిన ఇరువురికి అధికారులు, నాయకులు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. చెక్కులు పంపిణీ కార్యక్రమానికి సర్పంచ్‌లను ఆహ్వానించి అందజేస్తున్న క్రమంలో సంబంధిత గ్రామపంచాయతీల సర్పంచ్‌లను తహసీల్దార్ పిలవకపోవడంపై ప్రోటోకాల్ పాటించలేదని పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి రామకృష్ణ, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ అధికారి రాజునాయుడు, ఆర్ఐ గోపాల్, సురేశ్ జడ్పీటీసీ సముద్రాల సరిత, ఎంపీటీసీ రాజన్న, మండల కో ఆప్షన్ సభ్యుడు సాజిత్, సర్పంచ్‌లు కావ్య, జాజిమొగ్గ శ్రీనివాస్, రాజన్న, సుధాకర్, మధనయ్య బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

• నియోజకవర్గ అభివృద్ధికి కృషి

బెజ్జూర్, డిసెంబర్ 30: రాజకీయ పార్టీల కతీతంగా భేదాభిప్రాయాలు లేకుండా సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యా ణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం లో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో రోడ్లు, వంతెనలతో పాటు ఆయా రంగాల్లో అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. అన్ని ఒకేసారి కాకుండా అంచెలంచెలుగా అభివృద్ధి చేయడానికి రాజకీయ పార్టీలతో పాటు అధికార యంత్రాంగం సహకరించాలన్నారు. రాష్ట్రాభివృద్ధితో పాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్రం నుంచి ప్రత్యేక నిధుల మంజూరు కోసం తమ వంతుగా కృషిచేస్తామన్నారు. అంతకు ముందు జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి తదితర పథకాలను ప్రవేశ పెట్టి సబ్బండ వర్గాల అభివృద్ధి కోసం పెట్టిన పథకాలన్నింటిని కొనసాగించాలన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే హరీశ్ బాబు, జడ్పీ చైర్మన్ కృష్ణారావు, ఎంపీపీ రోజా రమణి, జడ్పీటీసీ పుష్పలత, మండల అధికారులతో కలిసి కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 23 చెక్కులు మంజూరైనట్లు తహసీ ల్దారు భూమేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అన్వార్ హుస్సేన్, సహకార సంఘం చైర్మన్ కుర్సింగ ఓంప్రకాశ్, ప్రజాపాలన మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్, ఎంపీడీవో మాధవి, ఎంపీవో రమేశ్‌రెడ్డి, ఎస్ఐ దీకొండ రమేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొలెరో బోల్తా

పెంచికల్ పేట్,డిసెంబర్30 : మండలంలోని పెంచికల్‌పేట్-కాగజ్‌నగర్ ప్రధాన రహదారి ఉచ్చమల్లి వాగు బ్రిడ్జి సమీపంలో పత్తిలోడుతో కాగజ్‌నగర్‌కు వెళ్తున్న టీఎస్ 20టీ 1652 బొలెరో అదుపు తప్పి డబుల్ రోడ్డుపై బోల్తా పడిన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో డ్రైవరుకు ఎలాంటి గాయాలు కాలేదు. బొలెరోలో సామర్థ్యానికి మించి ఓవర్ లోడ్‌తో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఈ ఘటనకు ఓవర్‌లోడే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఇలాంటి వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఆసిఫాబాద్,డిసెంబర్30 : జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది.ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్‌హైమద్ వైద్య శిబిరాన్ని పరిశీలించారు. సొసైటీ ఆధ్వర్యంలో సేవలందించడం అభినందనీయమని ఎంపీపీ పేర్కొన్నారు. వైద్య శిబిరంలో 143 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు తారిక్,సభ్యులు అబ్దుల్ ముబషీర్,ఆఫారి,హైమద్, ఖలీల్, ఆఫ్రోజ్ ఖాన్, మోహీన్, నిసార్, హీఫీజ్, సాజిద్, ఇమ్రాన్, ట్యాబ్‌టెక్నిషియన్లు శివ, వంశీ, సాజిద్, వినోద్, శ్రుతి, అశ్విత, కృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

శేష జీవితాన్ని సంతోషంగా గడపాలి

రెబ్బెన, డిసెంబర్ 30 : సింగరేణిలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని ఖైర్‌గూడ ఓసీపీ ప్రా జెక్టు అధికారి నాయని ఉమాకాంత్ పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీ లో ఈపీ వెల్డర్‌గా విధులు నిర్వహించి శనివారం ఉద్యోగ విరమణ పొందిన అమ్జాదుల్లఖాన్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి మెమెంటో అందించి బెనిఫిట్స్ పత్రాలు, అందించారు. పీవో మాట్లాడుతూ, టర్మినల్ బెనిఫిట్స్ ద్వారా వచ్చిన డబ్బులు చాలా పొదుపుగా వాడుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. గని మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఇన్‌చార్జి అబ్దుల్ రహమాన్, వెల్ఫేర్ అధికారి వేణు ఉద్యోగులు ఉన్నారు.

రాజీ మార్గమే రాచమార్గం

• జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్
• జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,086 కేసులు పరిష్కారం

కేసుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జడ్జి ఎంవీ రమేశ్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 30 : రాజీమార్గమే రాచమార్గమని ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 4 వేల 86 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కేసుల పరిష్కారం ద్వారా జరిమానా రూపంలో రూ. 21లక్షల 75 వేల 650 లు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ మంచి వేదికని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఉన్నారు.

• రాజీతోనే సమస్యలు పరిష్కారం

సిర్పూర్(టీ), డిసెంబర్ 30 : క్షణికావేశంలో పంతాలు, పట్టింపులకు పోయి కేసుల పాలైన వారంతా రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకోవాలని సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అజయ్ ఉల్లం సూచించారు. శనివారం మండలకేంద్రంలోని సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ కోర్టు లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సిర్పూర్(టీ) కోర్టు పరిధిలో మొత్తం 2,367 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. న్యాయవాదులు గణపతి, గంట కల్యాణ్, నియోజకవర్గంలోని ఆయా మండలాల ఎస్ఐలు, కక్షిదారులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తేవాలి

రెబ్బెన, డిసెంబర్ 30: మండలంలోని భగత్‌సింగ్‌నగర్, దుబ్బగూడలలో ఉన్న సులభ్ కాంప్లెక్స్‌లను వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులుగౌడ్ కోరారు. శనివారం ఆయా సులభ్ కాంప్లెక్స్‌లను సందర్శించిన అనంతరం మాట్లాడారు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు మరమ్మతులు లేక నిరుపయోగంగా మారడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి వాడుకలోకి తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో గోలేటి పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేశ్, నాయకులు బోదాసు వెంకటి, కళావతి, సుజాత, రాజయ్యలు ఉన్నారు.

కెరమెరిలో గంజాయి పట్టివేత

వాంకిడి: మోహర్లే బడిరాం అరెస్టును చూపుతున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై విజయ్

వాంకిడి, డిసెంబర్30: కెరమెరి మండ లం బారేమోడీలో ఒక కిలో 320 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వాంకిడి సీఐ శ్రీనివాస్ వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, కెరమెరి మండలంలోని బారేమోడీలో ఈ నెల 29న గంజాయి చెట్లు పెంచుతున్నారన్న పక్కా సమాచారంతో కెరమెరి ఎస్సై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా మోహర్లే బడిరాం ఇంటి వెనకాల ఉన్న పెరిటీలో రెండు గంజాయి మొక్కలు కనిపించాయి. గంజాయి మొక్కలను కెరమెరి పోలీసులు స్వాధీనం చేసుకొని కెరమెరి డిప్యూటీ తహసీల్దార్ రాజలింగం పంచనామా చేశారు. గంజాయి విలువ రూ.10వేలు ఉంటుందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

రికార్డులు సక్రమంగా నమోదు చేయాలి

వాంకిడి,డిసెంబర్ 30 : పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ప్రతి కేసు రికార్డులను సక్రమంగా ఉంచాలని, ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ సూచించారు. శనివారం వాంకిడి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను ఎస్సై సాగర్ డీఎస్పీకి వివరించారు. అనంతరం ఆయన సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేశారు. ప్రతిరోజు పోలీస్‌స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎవరి వర్టికల్‌లో వారు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. సాంకేతికతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. బాధితుల ఫిర్యాదుల పట్ల జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని డీఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్, మహిళా ఎస్సై తేజస్విని, సిబ్బంది ఉన్నారు.

గ్యాస్ ఈకేవైసీకి ఇబ్బందులు

కౌటాల: గ్యాస్ ఏజెన్సీ వద్ద ఈకేవైసీ కోసం ఎదురు చేస్తున్న మహిళలు

కౌటాల, డిసెంబర్ 30 : గ్యాస్ ఈకేవైసీ చేయించుకునేందుకు మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పనులు మానుకొని గ్యాస్ ఏజెన్సీల వద్ద పడిగాపులు కాస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని సిద్దార్థ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఈ కేవైసీకోసం నిరీక్షించారు. మొత్తం 15 వేల కనెక్షన్‌లు ఉండగా ఇప్పటికే 10 వేల ఈకేవైసీ పూర్తయిందని, మిగిలిన వారికి త్వరలోనే పూర్తి చేస్తామని డీలర్ దుర్గం జానకీ రాం తెలిపారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్, డిసెంబర్30 : జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల ప్రాం గణంలో జిల్లాస్థాయి జూనియర్ బాల, బాలికల కబడ్డీ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు కోవలక్ష్మి ,ప్రధాన కార్యదర్శి ఆత్రం ధర్మారావులు ప్రారంభించారు. ఈ పోటీలో ఎంపికైన క్రీడాకారులు 2024 జనవరి 11, 12, 13మ తేదీల్లో సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగే 49వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలకు జిల్లా తరపున పాల్గొనున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, జిల్లా క్రీడల అధికారి మీనారెడ్డి, జీసీడీవో శకుంతల, ఉపాధ్యాయులు ,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలి

కాగజ్‌నగర్, డిసెంబర్ 30 : దేశ వ్యాప్తంగా శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడే భీమేశ్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని జిల్లా కార్యాలయంలో 54వ ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోషలిజం జెండాను ఆవిష్కరించి భగత్‌సింగ్ చెగువేర్లకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా రంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయిక్రిష్ణ, నితీశ్, దేవి ప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చుల వివరాల అందజేత

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 28: నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఆయా పార్టీలు ఎన్నికల్లో చేసిన ఖర్చుల వివరాలను ఎన్నికల అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో సిర్పూర్(టీ) నియోజకవర్గంలో పోటీ చేసిన 4గురు అభ్యర్థులు తమ ఖర్చులు వివరాలను శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యలయంలో ఎన్నికల ఖర్చుల పరిశీలన అధికారులకు అందజేసి అక్నాలడ్జ్ స్లిప్‌ను తీసుకున్నారు. ఈ వివరాలను ఎన్నికల కమీషన్‌కు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. వివరాలు అందజేసిన వారిలో అభ్యర్థులు ఎల్ములే మనోహర్, అజయ్,నగేశ్,గంశిదాస్ ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 30: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఎమ్మెల్యే కోవలక్ష్మి, సోనేరావు దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు శిరీశ్ శర్మ అర్చనలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండా వెంకన్న, కమిటీ ప్రముఖులు ,పిన్న వివేక్ ,ఎకరాల శ్రీనివాస్, డాక్టర్ రమేశ్ , గడ్డల వెంకన్న, డా. మధు, ఐ.ఆంజనేయులు, టి అశోక్, గోపాల్ నాయక్, ప్రమోద్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు మల్లేష్, వెంకన్న, గంధం శ్రీనివాస్ పాల్గొన్నారు

జనవరి 20న అవిశ్వాసం

కాగజ్‌నగర్, డిసెంబర్ 30 : కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై జనవరి 20న అవిశ్వాస సమావేశం నిర్వహించడానికి కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశాలు జారీ చేసినట్లు ఆర్డీవో సురేశ్ తెలిపారు. ఉదయం 11.30 గంటలకు అవిశ్వానికి కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియా సభ్యుడు ఎమ్మెల్యే హరిశ్‌బాబు హాజరు కావాలని అధికారులు నోటీసులు అందించారు. కొద్ది రోజుల క్రితం కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టడానికి రంగం సిద్ధం చేసి అట్టి తీర్మానాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందించిన విషయం తెలిసిందే.

సదరం శిబిరాలను నిర్వహించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 30 : జిల్లాలో సదరం శిబిరాలను వెంటనే నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దుర్గం దినకర్ పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సదరం శిబిరాలు నిర్వహించక నెలలు గడుస్తున్నదని, సదరం సర్టిఫికెట్ లేక దివ్యాంగులు పింఛన్లు రాక అవస్థలు పడుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే శిబిరాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఉపాధిలోఅడిగిన వారికి పని కల్పించాలి

దహెగా, డిసెంబర్ 30 : ఉపాధిహామీ పథకంలో పనిచేస్తామని అడిగిన వారికి పని కల్పించాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా శనివారం మండలకేంద్రంలోని రైతువేదికలో చేపట్టిన ప్రజావేదిక కు ప్రజలెవరూ హాజరు కాలేదు. అంతేగాక ఇద్దరు ముగ్గురు సర్పంచ్‌లు మిన హాయిస్తే ప్రజాప్రతినిధులు కూడా హాజ రు కాలేదు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై గత వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. మొత్తం మండలం లో 585పనులకు గాను రూ.5.66కోట్లతో పనులు చేపట్టినట్లు అధికారులు నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీ వో సురేందర్ మాట్లాడుతూ పనిప్రదేశాలోల తప్పనిసరి గా ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో పొందుపర్చా లన్నారు. పనిప్రదేశాల్లో ఫోటోలు తీయకపోవడం రికార్డులు సరిగ్గా మెంటైన్ చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పని చేయకున్నా అదనంగా డబ్బులు చెల్లించిన 28మందికి జరిమానా విధించడంతో పాటు రికవరికి ఆదేశించారు. 17మందికి షోకాజ్ నోటీసులు జారి చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్ అధికారి సాయిశ్రీ, సర్పంచి పుప్పాల లక్ష్మి, విజిలెన్స్ అధికారి కృష్ణమూర్తి, ఎస్ఆర్పీ కొమురయ్య, ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీవోలు చంద్రయ్య, కల్పన, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
OWN BUSINESS OFFER
★18-28 సం॥ల యువతీ యువకులకు Rs. 49,000/- ల స్వల్ప పెట్టుబడిలోనే లోకల్ ఫ్రాంచైజీతో పర్మినెంట్ బిజినెస్ ఆదాయం. మల్టీసర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్ @ 15 సం॥ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ W.W.I-Hyd. Ph: 9908743603. NT-2580-All

పాస్‌పోర్ట్ పోయినది
నేను కామాజీ నరేష్ తండ్రి రాజేశ్వర్ నివాసం: ఇ.నెం. 1-13 గ్రా॥ దిలావర్‌పూర్, మం: ఖానాపూర్, జి: నిర్మల్, తెలంగాణ. నా యొక్క పాస్‌పోర్ట్ నెం. R2046027 గలది. తేది: 01.10.2023 దిలావర్‌పూర్ గ్రామం నుండి ఖానాపూర్‌కు బైక్ పై ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించండి.
సెల్ : 9963463457

CHANGE OF NAME
★I, ANGOLLA SAYA REDDY, S/o. RAJA REDDY, R/o. H.No.3-46, Kamol, Bhainsa, Nirmal changed my surname/Name as VANGA SAYA REDDY NTZ-318867

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
GST 5% వర్తించును
91827 77676, 91827 77679
91827 77671, 91827 77677